



ఎంజిఎం మైదానంలో జరిగిన యోగాలో పాల్గొని యోగాసనాలు వేస్తున్న కలెక్టర్, జాయింట్ కలెక్టర్, ఎస్‌పి, పుట్టపర్తి ఎమ్మెల్యే ఇతర జిల్లా అధికారులు

జీవన విధానంలా యోగా

◆ ప్రతి ఒక్కరూ క్రమం తప్పకుండా చేయాలి
◆ యోగాంధ్ర ముగింపు కార్యక్రమంలో కలెక్టర్
◆ జిల్లా వ్యాప్తంగా అంతర్జాతీయ యోగా కార్యక్రమాలు


ప్రజాశక్తి-హిందూపురం

పరిపూర్ణ ఆరోగ్యం కోసం ప్రతి ఒక్కరూ యోగాను జీవన విధానంలా మార్చుకోవాలని పలువురు పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా యోగాంధ్ర ముగింపు కార్యక్రమాలు శనివారం నిర్వహించారు. ఆయా ప్రాంతాల్లో ప్రభుత్వం ఆధ్వర్యంలో ప్రజల చేత యోగాసనలు వేయించారు. హిందూపురం ఎంజిఎం మైదానంలో 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవంలో భాగంగా జిల్లా స్థాయి యోగాంధ్ర కార్యక్రమాన్ని శనివారం ఉదయం నిర్వహించారు. కలెక్టర్ టిఎస్.చేతన్, జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, ఎస్‌పి రత్న, డిఆర్‌డిఎ పీడీ నరసయ్య, జిల్లా వైద్యాధికారిణి ఫైరోజ్ బేగంతో పాటు అధికారులు, విద్యార్థులు, ప్రజాప్రతినిధులు, వివిధ రంగాల నుంచి హాజరైన ప్రజలు యోగాసనాలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆరోగ్య ప్రమాణాలను మెరుగు పరిచేందుకు యోగా దోహదం చేస్తుందని చెప్పారు. యోగాను ప్రతి ఒక్కరూ దైనందిన జీవితంలో భాగంగా మార్చుకోవాలని సూచించారు. అనంతరం 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని జరిగిన మాసోత్సవాల కార్యక్రమాల్లో యోగా పోటీల్లో రాష్ట్ర, జిల్లా స్థాయిలో గెలుపొందిన వారికి సర్టిఫికెట్లు, మెమెంటోలను అందించి వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి, మున్సిపల్ చైర్మన్ రమేష్, మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున, పెనుకొండ ఆర్‌డిఒ ఆనంద్ కుమార్, డిప్యూటీ డిఎంహెచ్ఒ మంజు వాణి, టిడిపి జిల్లా అధ్యక్షుడు వడ్డే అంజినప్ప, డీఎస్పీ మహేష్, తహశీల్దార్ వెంకటేశు, అధికారులు, విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



సర్టిఫికెట్స్, మెమెంటోలు పొందిన వారితో జిల్లా అధికారులు

స్థానిక సంస్థలపైనా విద్యుత్ బాదుడు.!



స్థానిక సంస్థలపైనా విద్యుత్ ఛార్జీల బాదుడు సామాన్యంగా ఉండటం లేదు. ప్రజావసరాల కోసం వినియోగించే తాగునీటి విద్యుత్ కనెక్షన్లపైనా ఛార్జీల మోత మోగుతూనే ఉండటం గమనార్హం. దీనికి సంబంధించి వివరాలను ప్రజాశక్తి ప్రత్యేకంగా పరిశీలించింది. దీనికి సంబంధించి వివరాలు ఈ విధంగానున్నాయి.

◆ 'అనంత' నగరపాలిక విద్యుత్ వినియోగం బిల్లు రూ.46.88 లక్షలు
◆ బాదుడు రూ.18.25 లక్షలు ◆ అదనం మరో రూ.71.74 లక్షలు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

అనంతపురం నగరానికి తాగునీటిని అందించే వ్యవస్థ ప్రత్యేకంగా ఉంది. ఇందులో ప్రధానమైనది పిఎబిఆర్ డ్యామ్ నుంచి నీటిని పంపు చేసి ముద్దలాపురం వద్ద శుభ్రం చేస్తారు. ప్రధానంగా నీటిని పంపింగ్ చేసే పిఎబిఆర్ వద్ద వాడే విద్యుత్ మోటర్లకు సంబంధించి కరెంటు బిల్లు ఏప్రిల్ నెలకు సంబంధించి చూస్తే వినియోగం ద్వారా అయిన బిల్లు రూ.46.88 లక్షలు ఉంది. లేటు ఫీజు కింద రూ.6.40 లక్షలు, ఇడి వడ్డీ రూ.4566, ఎసిడి సర్‌ఛార్జీ రూ.1.09 లక్షలు, ట్రూఅప్ ఛార్జీ రూ.1.95 లక్షలు, ఎఫ్‌పిసిసిఎ ఫిబ్రవరి 2025కు సంబంధించి రూ.1.96 లక్షలు, జూన్ 2022 రూ.3.21 లక్షలు, ఆగస్టు 2022 రూ.99324, మే 2023కు సంబంధించి రూ.2.56 లక్షలు కలిపి మొత్తం అదనపు ఛార్జీలు రూ.18.25 లక్షలు భారం పడనుంది. ఇది చాలదన్నట్టు విద్యుత్ వినియోగం ఒక్కసారిగా పెరిగిందన్న పేరుతో ఎసిడి (అడ్డాన్సుడు కంజమన్షన్ డిమాండ్) ఛార్జీ రూ.71.74 లక్షలు కట్టాలని నోటీసు ఇచ్చింది. ఈ అడ్డాన్స్ కంజమన్షన్ డిమాండ్ అన్నది విద్యుత్ వినియోగం సాధారణం కంటే ఎక్కువగా ఉందని చెప్పి అదనపు డిపాజిట్ రూపంలో వసూలు చేసేది. ఈ రకంగా నగర పాలక సంస్థలోని ఒక్క విద్యుత్ మోటర్లపైనే రూ.89.99 లక్షలు అదనపు భారాన్ని ఏప్రిల్ మాసంలో ప్రభుత్వం విధించడం గమనార్హం. ఈ రకంగా అనంతపురం జిల్లాలో గ్రామీణ తాగునీటి సంస్థ పరిధిలోనే 26 సిడబ్ల్యుఎస్ పథకాలున్నాయి. ఇవి కాకుండా ఆయా పురపాలక సంఘాల పరిధిలోనూ ప్రత్యేకంగా తాగునీటి వ్యవస్థ ఉంది. వీటిపైనా ఇదే రకంగా పన్నుల భారం పడటం గమనార్హం.




అన్ని స్థానిక సంస్థలపైనా ఇదే తీరు

సామాన్య ప్రజలపై మోపుతున్నట్టే స్థానిక సంస్థలపైనా విద్యుత్ బాదుడు ఆగటం లేదు. ట్రూఅప్ ఛార్జీలు, ఎఫ్‌పిపిసిఎ ఛార్జీల మోతలు మోగిస్తోంది. అధికారంలోకి సవ్తూనే విద్యుత్ భారాలను తగ్గిస్తామని చెప్పిన తెలుగుదేశం పార్టీ ఇప్పుడు మాత్రం వాటిని ఏ మాత్రం తగ్గించకపోగా వైసిపి ప్రభుత్వ హయాంలోని ఎఫ్‌పిసిసిఎ భారాలను కూడా వసూలు చేస్తుండటం గమనార్హం. అసలే స్థానిక సంస్థల వద్ద నిధులు అంతంత మాత్రంగానే ఉంటున్న తరుణంలో ఈ భారాలు తడిసి మోపెడుతున్నాయి. స్థానిక సంస్థలు కాబట్టి అధికారులు, పాలకవర్గాలేవి నోరు విప్పలేని పరిస్థితులున్నాయి.

ఎంటిఎస్ ఉపాధ్యాయులకు బదిలీల షాక్.!

◆ రెగ్యులర్ ఉపాధ్యాయుల చేరికతో తప్పని స్థానచలనం
◆ దూర ప్రాంతాలకు పోస్టింగ్ ఇచ్చేలా నిర్ణయాలు
◆ 1998, 2008 డీఎస్సీ ఉపాధ్యాయుల్లో టెన్షన్



ప్రజాశక్తి అనంతపురం సిటీ

ఉపాధ్యాయుల బదిలీల్లో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు మినిమం టైం స్కేల్(ఎంటిఎస్) ఉపాధ్యాయులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తోంది. ఉపాధ్యాయ పోస్టులకు సంబంధించి 1998, 2008 డీఎస్సీలో ఎంపిక అయ్యిన వారు అప్పట్లో నెలకొన్న సమస్యలతో అనాటి ప్రభుత్వాలు వీరికి పోస్టింగ్‌లు ఇవ్వలేదు. 2019లో అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం వీరందరికీ ఉపాధ్యాయులుగా నియామకాలు ఇచ్చేందుకు నిర్ణయం తీసుకుంది. 2008 డీఎస్సీలో ఎన్నికైన వారికి 2021లో, 1998 డీఎస్సీ వారికి 2023లో కాంట్రాక్ట్ బేసిస్ కింద ఎంటిఎ ఉపాధ్యాయులుగా ఎంపిక చేశారు. ఇందులో భాగంగా ఉమ్మడి అనంతపురం జిల్లాలో 1998లో 500 మంది, 2008లో 200 మందికి పోస్టింగ్‌లు ఇచ్చారు. వీరందరినీ మినిమం టైం స్కేల్(ఎంటిఎస్) కింద నియామకాలు చేపట్టారు. ప్రభుత్వం ప్రకటించిన నామమాత్రపు వేతనం తప్పా వీరికి డిఎలు హెచ్‌ఆర్ఎలు వర్తింపచేయలేదు. వీరి ఎంపిక సమయంలో ఎక్కడ ఖాళీలు ఉంటే అక్కడ వీరికి పోస్టింగ్‌లు ఇచ్చారు. 2021లో పోస్టింగ్ ఇచ్చిన వారిని వర్క్ అడ్జెస్ట్‌మెంట్ కింద సుదూర ప్రాంతాలకు బదిలీ చేశారు. 2023లో అప్పటి ప్రభుత్వం. హెచ్‌ఆర్ఎ, డిఎలు వీరికి వర్తింపజేయలేదు. ఈ పరిస్థితుల్లో వచ్చే చాలీచాలని వేతనంతో దూరప్రాంతాలకు వెళ్లి పనిచేసేందుకు వీరంతా ఇబ్బందులు పడ్డారు. ఈ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లగా వారి సొంత మండలాలకు దగ్గర్లో ఖాళీలను బట్టి పోస్టింగ్ ఇచ్చేలా జీవోను గత ప్రభుత్వం విడుదల చేసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ ఏడాది విద్యా సంవత్సరం ప్రారంభంలో ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ట్రాన్స్‌ఫర్ యాక్ట్ (ఏపీటిటిఎ) కింద రెగ్యులర్ ఉపాధ్యాయులకు బదిలీలు నిర్వహించారు. ఈ బదిలీల్లో ఎంటిఎస్‌లు పని చేస్తున్న పోస్టును ఖాళీగా చూపి అక్కడ రెగ్యులర్ ఉపాధ్యాయున్ని నియమించారు. అక్కడ రెగ్యులర్ ఉపాధ్యాయుడు చేరడంతో ఎంటిఎస్ కింద చేరిన వారు మళ్లీ సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ఆయా పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను వర్క్ అడ్జెస్ట్‌మెంట్ కింద ఎంటిఎస్‌లో బదిలీలు నిర్వహించేలా ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నిర్ణయం ఎంటిఎస్ ఉపాధ్యాయులకు శరాఘాతంగా మారింది. తక్కువ వేతనం, డిఎలు, హెచ్‌ఎఆర్‌లు లేవు. పైగా ఈ విధానంలో పని చేస్తున్న అందరూ 45 నుంచి 50 ఏళ్ల పైబడిన వారే ఉన్నారు. రెండు, మూడు సంవత్సరాల్లో ఉద్యోగ విరమణ చేసే వారూ ఉన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో దూర ప్రాంతాల్లో విధుల్లో విధులు నిర్వహించేందుకు ఎంటిఎస్ ఉపాధ్యాయులకు కష్టంగా మారింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం పునరాలోచించి ఎంటిఎస్ ఉపాధ్యాయులను వారి మండల కేంద్రం సమీప కేంద్రాల్లోనే పోస్టింగ్‌లు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

తత్కాల్ టికెట్ల దందా..!

◆ గుత్తి రైల్వే బుకింగ్ కార్యాలయంలో అఅకమాలు
◆ దళారులతో తత్కాల్ రిజర్వేషన్లు
◆ సాధారణ ప్రయాణికులకు అందని టికెట్లు



ప్రజాశక్తి-గుత్తి



గుత్తి రైల్వే స్టేషన్‌లో దళారుల తత్కాల్ రిజర్వేషన్ టికెట్ల దందా కొనసాగు తోందని విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఈ టికెట్ల రిజర్వేషన్ వ్యవహారంలో అవినీతి, అక్రమాలు పెచ్చుమీరాయనే విమర్శలు సర్వత్రా వ్యక్తం అవుతున్నాయి. ఏసీ తాత్కాల్, సాధారణ తాత్కల్ టికెట్ల బుకింగ్ కోసం వచ్చే ప్రయాణికుల నుంచి పలువురు దళారులు అధిక డబ్బులు వసూలు చేస్తున్నట్లు సమాచారం. బుకింగ్ క్లర్కులు అక్రమాల అవతారం ఎత్తి పెద్ద ఎత్తున ప్రయాణికులను డబ్బులు వసూలు చేస్తున్నట్లు తెలుస్తోంది. గుత్తి రైల్వే బుకింగ్ కార్యాలయంలో ఈ తత్కాల్ దందా వ్యహారం చాలా ఎళ్లగానే జరుగుతోంది. స్థానికంగా ఉన్న దళారుల సాయంతో బుకింగ్ క్లర్కులు అక్రమాలకు పాల్పడుతున్నారు. గుత్తి నుంచి విజయవాడ, విశాఖపట్నం, ముంబై నగరాలకు అధిక సంఖ్యలో ప్రయాణికులు తాత్కాల్ రిజర్వేషన్ టికెట్లను బుక్ చేసుకుంటారు. స్థానిక రైల్వే షెడ్డు, ఇతర విభాగాల్లో బీహార్, రాజస్థాన్, ఉత్తర ప్రదేశ్, మధ్యప్రదేశ్, పశ్చిమబెంగాల్‌తోపాటు పలు రాష్ట్రాలకు చెందిన రైల్వే అధికారులు, కార్మికులు విధులు నిర్వహిస్తున్నారు. వారందరూ స్వగ్రామాలకు వెళ్లేందుకు తత్కాల్ రిజర్వేషన్ టికెట్ల బుకింగ్ కోసం కార్యాలయానికి వెళుతుంటారు. రైల్వే బుకింగ్ కార్యాలయం వద్ద ఒకరోజు ముందే రైల్వే ప్రయాణికులు తత్కాల్ రిజర్వేషన్ అప్లికేషన్ ఫామ్‌ను పూర్తి చేసి ఉంచుతారు. మరుసటి రోజు తత్కాల్ సమయానికి వెళ్లి క్యూలో నిల్చొని రిజర్వేషన్ చేసుకుంటారు. ఆ సమయంలో దళారుల వద్ద ఉన్న అప్లికేషన్లను ముందుగానే బుకింగ్ క్లర్కులకు అందజేస్తారు. దళారుల అందించిన దరఖాస్తులను ముందుగా తీసుకోవడంతో వారికే టికెట్లు వస్తున్నాయి. సాధారణ ప్రయాణికుల వంతు వచ్చే సరికి టికెట్లు లేవని బోర్డు పెట్టేస్తున్నారు. ఇలా ప్రతిరోజూ గుత్తి రైల్వే బుకింగ్ కార్యాలయంలో 20 నుంచి 30 ఏసీ తత్కాల్, సాధారణ తత్కాల్ రిజర్వేషన్ టికెట్లు బుక్ అవుతాయి. అందులో దాదాపు 10 నుంచి 15 టికెట్లను క్లర్కులు అక్రమంగా బుకింగ్ చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. టికెట్లు రిజర్వేషన్ చేస్తే ఒక్కో ప్యాసింజర్ నుంచి అదనంగా రూ.200 నుంచి రూ.300 తీసుకుంటున్నట్లు రైల్వే ప్రయాణికులు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. అదనంగా వసూలు చేసిన సొమ్మును దళారులు, క్లర్కులు పంచుకుంటున్నారు.

కమర్షియల్ ఇన్స్‌పెక్టర్ల తనిఖీలు..!?

గుంతకల్లులో విధులు నిర్వహించే కమర్షియల్ ఇన్స్‌పెక్టర్లు శనివారం గుత్తి రైల్వే బుకింగ్ కార్యాలయంలో ఆకస్మికంగా తనిఖీ చేశారు. అందులో బుకింగ్ అయినా మూడు తత్కాల్ రిజర్వేషన్ టికెట్లను పరిశీలించారు. వాటికి క్లర్కు వద్ద ఉన్న నగదుకు తేడా ఉండడంతో ఆ టికెట్లను అధికారులు స్వాధీనం చేసుకుని వెళ్లినట్లు సమాచారం. ఆ ప్రయాణికులు విన్నపం మేరకు కమర్షియల్ అధికారులు గుంతకల్లు నుంచి డెమో రైలులో టికెట్లను తిరిగి గుత్తికి పంపారని తెలిసింది. ఇలాంటి తత్కాల్ టికెట్ల రిజర్వేషన్ అక్రమాలు గుత్తి రైల్వే స్టేషన్‌లో సర్వసాధారణం అని దీనిపై రైల్వే ఉన్నతాధికారులు విచారణ జరిపిస్తే మరిన్ని వాస్తవాలు వెలుగు చూస్తున్నాయని ప్రయాణికులు చెబుతున్నారు.



ఖైదీలతో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వర్లు నాయక్

ఖైదీల ప్రవర్తనలో మార్పు రావాలి

సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వర్లు నాయక్

ప్రజాశక్తి-హిందూపురం

క్షణకావేశంలో తప్పులు చేసి కారాగారాలకు వచ్చే ఖైదీల పరివర్తనలో మార్పు రావాలని స్థానిక సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వర్లు నాయక్ పేర్కొన్నారు. శనివారం స్థానిక ఉపకారాకారాన్ని ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఖైదీల కోసం తయారు చేసిన ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఇందులో భాగంగా ఖైదీలతో యోగాసనాలు వేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తప్పులు చేసి జైలుకు వచ్చిన తర్వాత మార్పు రావాలన్నారు. తప్పులు చేసి జైళ్లకు రావడం వల్ల కుటుంబ మర్యాద దెబ్బ తినడంతో పాటు ఆర్థికంగా కూడా ఇబ్బందులకు గురి కావాల్సి వస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు పార్వతి, సంతోషి కుమారి, రవిచంద్ర, లోక్ అదాలత్ సిబ్బంది హేమావతి, పిఎల్‌వి సురేష్ కుమార్ పాల్గొన్నారు.

ప్రారంభమైన పాలిసెట్ కౌన్సిలింగ్

హిందూపురం : హిందూపురం పట్టణంలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో పాలిసెట్-2025 కౌన్సిలింగ్ శనివారం సజావుగా సాగిందని కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ. హరినాథ్ బాబు తెలిపారు. మొదటి రోజు 52 మంది అభ్యర్థులు సర్టిఫికెట్ల వెరిఫికేషన్ పూర్తి చేసుకున్నారని తెలిపారు. కౌన్సిలింగ్ కేంద్రంలో క్యూఆర్ కోడ్ ఏర్పాటు చేయడం ద్వారా జోన్-4 ఉన్న అన్ని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలు అందులో అందించబడుతున్న కోర్సు వివరాలు అభ్యర్థుల, తల్లిదండ్రులకు సులువుగా అర్థమయ్యేలాగా క్రోడీకరించి తెలిపామన్నారు. హిందూపురం పరిసర ప్రాంతాల్లో ఉన్న అభ్యర్థులు, ఏ ఇతర ప్రాంతాలకు చెందిన అభ్యర్థులైన ఈ హెల్ప్ లైన్ సెంటర్ ను వినియోగించుకొని పాలీసెట్ కౌన్సిలింగ్ సదుపాయాన్ని ఈనెల 30వ తేదీ వరకు నిబంధనలకు అనుగుణంగా వినియోగించుకోవచ్చని ఆయన వివరించారు.

23న తాడేపల్లిలో సర్పంచుల సమావేశం

వైసిపి పిఆర్ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేష్‌రెడ్డి

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్



సురేష్‌రెడ్డి

ఈ నెల 23వ తేదీ తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో పంచాయతీ రాజ్ విభాగం రాష్ట్ర అధ్యక్షులు వెన్నపూస రవీందర్‌రెడ్డి అధ్యక్షతన విస్తృత స్థాయి సమావేశం నిర్వహిస్తున్నారని, కావున జిల్లా వ్యాప్తంగా పంచాయతీ రాజ్ విభాగంలోని కార్యవర్గ సభ్యులు తరలిరావాలని ఆ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రేగాటిపల్లి సురేష్‌రెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆ సమావేశంలో ముఖ్యంగా ఎన్ఆర్ఈజిఎస్‌లో ఫారం ఫండ్ల నిర్మాణంలో జరుగుతున్న అవినీతి, సర్పంచులకు కనీస సమాచారం ఇవ్వకుండా, రెజల్యూషన్ పాస్ చేయకుండా చేస్తున్న పనులపై పార్టీ ఆధ్వర్యంలో చేపట్టాల్సిన ఆందోళనలకు సంబంధించి కార్యాచరణపై చర్చిస్తారన్నారు. అంతేకాకుండా ఇటీవల ప్రభుత్వం అమలు చేసిన తల్లికి వందనం కార్యక్రమంలో అర్హత ఉన్నప్పటికీ సర్పంచులు, ఎంపిటిసిల కుటుంబాలను అనర్హులుగా పేర్కొంటూ చేస్తున్న అన్యాయాన్ని ఎండగట్టి రానున్న రోజుల్లో వైసిపి పంచాయతీ రాజ్ విభాగం ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళనలు చేపడతామన్నారు. కావున ప్రతి ఒక్కరూ సమావేశానికి హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

అగ్నిమాపక కార్యాలయం తనిఖీ

ప్రజాశక్తి-హిందూపురం



కార్యాలయంలో రికార్డులను పరిశీలన చేస్తున్న జిల్లా అధికారి మాధవ నాయుడు

శ్రీ సత్యసాయి జిల్లా అగ్నిమాపక అధికారి మాధవ నాయుడు శనివారం స్థానిక అగ్నిమాపక కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. ఇటీవల సాధారణ బదిలీల్లో భాగంగా బాపట్ల జిల్లా నుంచి శ్రీ సత్యసాయి జిల్లా అగ్నిమాపక అధికారిగా ఆయన బాధ్యతలు స్వీకారించారు. ఇందులో భాగంగా అగ్నిమాపక కార్యాలయాన్ని తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. అనంతరం అగ్నిమాపక యంత్రం, సిబ్బంది వివరాలు తదితర అంశాలను అగ్నిమాపక కేంద్రం అధికారి ప్రభాకర్‌తో అడిగి తెలుసుకున్నారు. భాగంగా సిబ్బందికి అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలని సూచనలు చేశారు.

మహిళ స్వేచ్ఛ, సాధికారతకు ప్రతీక 'ఇంతియానం'

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ఆడవారి కళ్లతో ప్రపంచాన్ని చూపించే ప్రయత్నమే ఇంతియానం పుస్తకమని పుస్తక సంపాదకురాలు స్వర్ణ కిలారి అన్నారు. శనివారం సాయంత్రం అనంతపురంలోని ఎన్జీవో హోమ్‌లో సాహితీస్రవంతి, ఐద్వా సంయుక్తంగా ఐద్వా రాష్ట్ర కోశాధికారి సావిత్రి అధ్యక్షత 'ఇంతియానం 2.0' పుస్తక పరిచయ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా స్వర్ణ కిలారి మాట్లాడుతూ 45 మంది మహిళల యాత్రా కథనాల సంకలనం ఇంతియానంను రెండు సంవత్సరాల క్రితమే ప్రచురించామన్నారు. ఆ పుస్తకానికి వచ్చిన ఆదరణ చూశాక మరో 55 మంది మహిళల యాత్రా కథనాలతో 'ఇంతియానం 2.0' ప్రచురించామని తెలిపారు. ఈ రెండు సంకలనాల్లోనూ అబ్బురపరిచే ఆలోచనా విధానం, వైవిధ్య యాత్రా నేపథ్యం, సాహసాలూ ఉన్నాయన్నారు. ఆధునిక మహిళ స్వేచ్ఛా, సాధికారతలకు ప్రతీక స్వర్ణ కిలారి సంపాదకత్వంలో వచ్చిన 'ఇంతియానం' మహిళల యాత్రాకథనాల సంకలనమని పుస్తకాన్ని పరిచయం చేసిన మానవహక్కుల వేదిక నాయకులు ఎ.చంద్రశేఖర్ అన్నారు. ఇంతియానం తెలుగులో తొలి మహిళా యాత్రా కథనాల సంకలనమని, ఒక్కో కథనం ఒక్కో ప్రదేశాన్నే కాదు, ఒక్కో స్త్రీ అంతరంగాన్ని, జీవన తాత్వికతనూ కళ్లముందు నిలుపుతుందని సంపాదకురాలిని, వ్యాసకర్తలను అభినందించారు. ఔత్సాహిక యాత్రికులు, ప్రభుత్వ మహిళా కళాశాల లెక్చరర్ మేరీమాధురి, ఆంగ్ల దినపత్రిక ద హిందూ పూర్వ కరస్పాండెంట్ రమేష్ సుసర్ల, సంగీతవాణి నిర్వాహకులు అడవాల శేషగిరి రాయుడు తమయాత్రల అనుభవాలను సభలో పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో రిటర్న్ డిప్యూటీ కలెక్టర్ గోవిందరాజులు, సాహితీస్రవంతి నాయకుడు సూర్యనారాయణరెడ్డి, ఐద్వా నాయకురాలు అశ్విని, ప్రసూన, రచయితలు శశికళ, తరిమెల అమర్నాథరెడ్డి, జూటూరు షరీఫ్, ఏలూరి యంగన్న, సత్యబోస్, గోవిందరాజులు, బిజిలీ, రాధేయ, రియాజుద్దీన్, రాజ్‌మోహన్, అధ్యాపకులు శివచంద్ర, పల్లవి, యుటిఎఫ్ నాయకులు కోటేశ్వరప్ప, రమణయ్య, గోవిందరాజులు, నాగేంద్ర, సాహితీవేత్తలు పాల్గొన్నారు.



పుస్తకాలను విద్యార్థులకు అందిస్తున్న దృశ్యం

విద్యా సామగ్రి పంపిణీ

ప్రజాశక్తి-హిందూపురం

పట్టణంలో 21వ వార్డు మోతుకపల్లి మున్సిపల్ పాఠశాల విద్యార్థులకు యూనిఫారమ్, పుస్తకాలతో కూడిన విద్యాసామగ్రి కిట్లను శనివారం పంపిణీ చేశారు. ఆ వార్డు ఇన్‌ఛార్జి, పార్లమెంట్ మీడియా కోఆర్డినేటర్ చంద్రమోహన్ యాదవ్ మాట్లాడుతూ గత ప్రభుత్వ కన్నా ఇప్పటి టిడిపి ప్రభుత్వం ఇంట్లో స్కూలుకు వెళ్లే ప్రతి విద్యార్థికి ఏటా రూ.13 వేలు ఇవ్వడం చాలా సంతోషకరమని తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు వెంకటేష్, కౌన్సిలర్ రాఘవేంద్ర, బూత్ ఇన్‌ఛార్జి రామ్ రెడ్డి, ఆనంద్, శ్రీనివాసులు, నాయకులు రవిచంద్ర, సుధాకర్ రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, గోవింద్ విద్యా కమిటీ చైర్మన్, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పరిశోధనలకు ఐఒటి తోడ్పాటు

ప్రజాశక్తి-అనంతపురం

పరిశోధనలకు ఐఒటి (ఇంటర్నెట్ అఫ్ థింగ్స్) తోడ్పాటు అందిస్తున్నని జెఎన్‌టియు ఉపకులపతి హెచ్.సుదర్శనరావు అన్నారు. శనివారం అనంతపురం జెఎన్‌టియు ఇంజినీరింగ్ కళాశాలలో ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ విభాగంలో ఐఒటి ల్యాబ్‌ను విసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐఒటి అప్లికేషన్స్‌ను ప్రతి ఒక్కరూ, ప్రతిరోజూ, ప్రతిచోటా వాడుతున్నామని తెలిపారు. అంతేగాకుండా జీవితాన్ని సౌర్యవంతంగా చేసుకోవడానికి ఉపయోగపడుతుందన్నారు. ఎం.టెక్, బి.టెక్ విద్యార్థులు ఐఒటి (ఇంటర్నెట్ అఫ్ థింగ్స్) ఉపయోగించుకుని ప్రాజెక్టులు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ పి.చెన్నారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ ఎస్.వసుంధర, ఇసిఇ విభాగం విభాగం అధిపతి జి.మమత, అల్యూమిని సభ్యులు జానకిరామ్, పి.శాంతిసాగర్, ఎన్.హర్ష, వి.శంకర్, ఇసిఇ విభాగం అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

నష్టాల బాటలో వెజిటబుల్స్ నర్సరీలు.!



ప్రజాశక్తి-రొద్దం

మండలంలోని వెజిటబుల్ నర్సరీల నిర్వాహకులు ఏడాదిగా తీవ్ర నష్టాలు చవి చూస్తున్నట్లు తెలుస్తోంది. మండలంలోని పెనుకొండ-పావగడ ప్రధాన రహదారిలో మూడు నర్సరీలు నిర్వహిస్తు న్నారు. అయితే ఆయా నర్సరీల్లో పైర్లు కొనేవారు లేక తీవ్రంగా నష్టపోతున్నట్లు నిర్వాహకులు వాపోతున్నారు. నిర్వాహకులు సుమారు ఐదారేళ్ల నుంచి ప్రధాన రహదారి పక్కనే ఏడాదికి సుమారు రూ. 60 వేల నుంచి రూ. 70 వేలు బాడుగ చెల్లిస్తూ వెజిటబుల్ నర్సరీలు నిర్వహిస్తున్నారు. అయితే ఏడాది నుంచి మండలంలో ఎక్కువగా మొక్కజొన్న, పత్తి పంటలు సాగు చేయడం మిరప, టమోటా వంటి పంటలకు గిట్టుబాటు ధర లేకపోవడం నర్సరీలకు శాపంగా మారింది. సీజన్‌లో రూ. లక్షలు వెచ్చించి 25 నుంచి 30 రోజులు శ్రమించి పైర్లు అందుబాటులో ఉంచినా కొనేవారు రావడం లేదని, దీంతో పైర్లను రోడ్డుపై పడేయాల్సి వస్తుందని, తద్వారా తీవ్రంగా నష్టపోతున్నామని నిర్వాహకులు వాపోతున్నారు. ఈ క్రమంలో ఇప్పటికే రూ. 15 లక్షల విలువ చేసే పైర్లు పాడయ్యాయని, ఇప్పుడు మరో రూ. 2 లక్షల విలువ చేసే పైర్లు పడేయాల్సిన పరిస్థితి తలెత్తిందని నిర్వాహకులు కంటతడి పెడుతున్నారు. నర్సరీ నిర్వహించడానికి చేసిన అప్పులు తీర్చడానికి కర్నాటకలోని వెంకటాపురంలో ఉన్న ఇల్లు అమ్మడంతో పాటు బంగారం బ్యాంకులో తాకట్టు పెట్టినట్లు తెలిపారు. మరో వ్యక్తి రాజు మాట్లాడుతూ తమ నర్సరీలో సుమారు రూ. 2 లక్షల విలువ చేసే పైర్లు పారేశామన్నారు. చౌడేశ్వరీ నర్సరీలో రూ. 2 లక్షల విలువ చేసే టమోటా పైర్లు, రూ. లక్ష మిరప పైరు పారేసినట్లు నిర్వాహకుడు గంగరాజు వాపోయాడు. కర్నాటకలోని వెంకటాపురం వద్ద కూడా నర్సరీ నడుపుతున్నామని, అందులో రూ. 5 లక్షల విలువ చేసే పైర్లు పారేసినట్లు ఆవేదన వ్యక్తం చేశాడు. ఇలా ఇప్పటికే లక్షలాది రూపాయిలు నష్టపోయినట్లు నిర్వాహకులు వాపోయారు.

ఇల్లు అమ్ముకున్నా : రమేష్

దాదాపు ఏడాది నుంచి నర్సరీ సరిగా నడవడం లేదు. దీంతో చేసిన అప్పులు తీర్చడానికి కర్నాటకలోని వెంకటాపురం గ్రామంలో ఉన్న ఇల్లు అమ్మేశా. బంగారు ఆభరణాలు బ్యాంకులో తాకట్టు పెట్టాం.

ఎన్నడూ లేని విధంగా నష్టాలు : గంగరాజు

పదేళ్ల నుంచి నర్సరీ నడుపుతున్నాం. అయితే ఈ ఏడాది ఎన్నడూ లేని విధంగా నష్టాలు చూశాం. ప్రభుత్వం ఆదుకోవాలి.

అప్పులే మిగిలాయి : రాజు



నర్సరీ నిర్వహణ కోసం సుమారు రూ. 7 లక్షలు అప్పు చేశా. ఆ అప్పులు తీర్చేందుకు బంగారం అంతా అమ్మేశా. ఇంకా అప్పులు మిగిలాయి.



యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా

ప్రజాశక్తి-తాడిమర్రి

చిత్రావతి నది పరివాహక ప్రాంతం నుంచి యథేచ్ఛగా ఇసుకను అక్రమంగా తరలిస్తున్నట్లు మండల ప్రజలు పేర్కొంటున్నారు. మండలంలోని దాడితోట, నాయనపల్లి గ్రామాల మీదుగా ప్రవహించే చిత్రావతి నది నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా పగలు, రాత్రి తేడా లేకుండా ట్రాక్టర్ల ద్వారా అక్రమంగా ఇసుకను ఇతర జిల్లాలకు తరలిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్థులు మండిపడుతున్నారు. చిత్రావతి నది నుంచి పెద్దమొత్తంలో ఇసుక తరలించడం వల్ల ఈ ప్రాంతంలో భూగర్భ జలాలు అడుగంటి నీటి కొరత ఏర్పడుతుందని, వెంటనే అధికారులు స్పందించి ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని ప్రజలు, రైతులు కోరుతున్నారు.

వర్షం కురవక.. విత్తనం పడక...



ప్రజాశక్తి-అమడగూరు

ముందస్తు వర్షాలతో మురిపించిన వరుణుడు ఆ తరువాత ముఖం చాటేశాడు. నైరుతి రుతుపవనాలు ప్రభావం చూపుతున్నా భారీ గాలులకు మేఘాలు చెదిరిపోతున్నాయి. దీంతో కీలకమైన సమయంలో పదునయ్యే వర్షం కురవడం లేదు. ఇప్పటికే దుక్కులు దున్ని సిద్ధం చేసుకున్న రైతులు వరుణుడు కరుణించి మంచి వర్షం కురిస్తే విత్తనాలు వేయాలని భావిస్తున్నారు. కానీ వరుణుడు చిరుజల్లులతో సరిపెడుతున్నారు. మండలంలో మోస్తరు వర్షం కూడా కురవలేదని రైతులు దిగాలు చెందుతున్నారు. సకాలంలో వర్షాలు కురవకపోతే విత్తనాలు మొలకెత్తడం ప్రశ్నార్థకంగా మారుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

కొనుగోలుకు ఆసక్తి చూపని రైతులు

ఖరీఫ్ సీజన్‌లో ప్రభుత్వం రైతులకు రాయితీపై అందించే విత్తన వేరుశనగ కొనుగోలుకు రైతులు ఆసక్తి చూపడం లేదు. పెట్టుబడికి చేతిలో చిల్లిగవ్వ లేకపోవడం ఓ కారణం కాగా, ప్రభుత్వం అందజేసే విత్తన వేరుశనగ కాయలు నాసిరకంగా ఉన్నాయని రైతులు చెబుతున్నారు. దీంతో ఆర్ఎస్‌కెల్లో భద్రపరిచిన విత్తన వేరుశనగ కొనుగోలు చేయడానికి రైతులు పెద్దగా ఆసక్తి చూపడం లేదు.

తగ్గుతున్న వేరుశనగ సాగు విస్తీర్ణం

ఖరీఫ్ సీజన్‌లో మండలంలో రైతులు 2,800 హెక్టార్లల్లో వివిధ పంటలు సాగు చేస్తారు. ప్రధాన వేరుశనగ పంట మాత్రం 1,400 హెక్టార్లలో సాగులోకి వస్తుంది. అయితే సాగు ఖర్చు పెరగడం, ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోకపోవడం, ఎరువులు, పురుగు మందుల ధరలు ఆకాశాన్ని అంటుతుండడంతో ఏటేటా వేరుశనగ సాగు విస్తీర్ణం తగ్గుతూ వస్తోంది. ప్రస్తుత పరిస్థితుల్లో ఈఏడాది కూడా వేరుశనగ సాగు విస్తీర్ణం మరింత తగ్గే అవకాశాలు కనిపిస్తున్నాయి.



చట్టాలపై అవగాహన కల్పిస్తున్న సీఈఓ లావణ్య

మహిళా చట్టాలపై అవగాహన

ప్రజాశక్తి-రొద్దం

మండలంలోని ఎల్.తిమ్మాపురంలో శనివారం అనంతశక్తి సొసైటీ ఆధ్వర్యంలో సిఇఒ లావణ్య, అధ్యక్షురాలు సుశీలమ్మ అధ్యక్షతన మహిళలకు మహిళా చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. వారు సమాజంలో మహిళలపై జరుగుతున్న వివక్ష, హింసపై నాటిక రూపంలో ప్రదర్శించారు. గృహహింస, బాల్య వివాహాలు, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సొసైటీ సిబ్బంది, న్యాయ సలహా కేంద్రం కమిటీ సభ్యులు, సిఇఒ కవిత, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ ఉపాధ్యాయునికి సన్మానం

ప్రజాశక్తి-మడకశిర

రొళ్ల మండలంలోని కాకి జడ్పీ హైస్కూల్‌లో పని చేస్తున్న ఎస్ఎల్ఎన్.మూర్తి ఇటీవల ఉద్యోగ విరమణ పొందారు. దీంతో కాకి ఉన్నత పాఠశాలలో శనివారం ఆయనకు సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథులుగా హాజరైన హెచ్ఎం ఆర్‌కె.దాసిగౌడ్ మాట్లాడుతూ ఆయన విధి నిర్వహణలో చేసిన సేవలను కొనియాడారు. రొళ్ల జడ్పీ హైస్కూల్ ఉపాధ్యా యుడు ఎంజారప్ప మాట్లాడుతూ విధి నిర్వహణలో ఉపాధ్యాయుడు చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కృష్ణప్ప, కన్వీనర్ దాసిరెడ్డి, ప్రధాన కార్యదర్శి జికె.ఈరన్న, రొళ్ల కొండ రామకృష్ణ, విశ్రాంత ఉపాధ్యాయుడు ఎంఈ. గోవిందప్ప, ఉపాధ్యాయులు, పుర ప్రముఖులు పాల్గొన్నారు.

రాయితీపై పశుదాణా పంపిణీ

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

మండలంలోని చింతలపల్లి పశువైద్య కేంద్రంలో 80 మంది పాడి రైతులకు 80 బ్యాగుల పశుదాణాను సబ్సిడీపై పంపిణీ చేసినట్లు మండల పశు వైద్యాధికారి డాక్టర్ శేఖర్ తెలిపారు. పట్టణంలో శనివారం ఆయన మాట్లాడుతూ 50 కిలోల బ్యాగ్ ధర రూ. 1100 కాగా 50 శాతం సబ్సిడీ పోనూ రైతు వాటా రూ. 555 తీసుకొని పాడి రైతులకు పంపిణీ చేశామన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అలాగే పశువుల ఆరోగ్య విషయంలో తగిన జాగ్రత్తలు పాటించాలని, వైద్యుల సలహాలు తప్పక పాటించాలని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ మహేష్ చౌదరి, విజయ్ సారథి, రైతులు, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.



దాణా పంపిణీ చేస్తున్న పశు వైద్యాధికారి డాక్టర్ శేఖర్

లేపాక్షి ఆలయ శిల్పకళ అత్యద్భుతం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-లేపాక్షి

ప్రపంచ ప్రసిద్ధిగాంచిన లేపాక్షి ఆలయ శిల్ప కళ అత్యద్భుతమని ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి పేర్కొన్నారు. ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్‌రెడ్డి శనివారం హిందూపురం పట్టణంలోని ఎంజిఎం మైదానంలో జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ యోగా దినోత్సవంలో పాల్గొన్నారు. ఆ తర్వాత లేపాక్షిలోని వీరభద్రస్వామి ఆలయాన్ని సందర్శించగా ఆలయ అర్చకులు, వేదపండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. వారు స్వామి వారిని దర్శించు కున్న తర్వాత వేద పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం వారు ఆలయ కట్టడాలు, శిల్పాలు, ప్రతిష్ట, విశేషాలను చరిత్రకారుడు రఘురామ ద్వారా తెలుసు కున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ లేపాక్షికి ఎంతో చరిత్ర ఉందని దేశ విదేశాల నుంచి పర్యాటకులు ఈ వస్తుంటారన్నారు. వీరభద్రస్వామి ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆలయ నిర్వాహకులు రామ్ ప్రసాద్, ట్రస్ట్ సభ్యులు ఏర్పాటుచేసిన అన్నదాన కార్యక్రమంలో అన్న ప్రసాదం స్వీకరించారు. అనంతరం నంది విగ్రహాన్ని సందర్శించారు. వారి వెంట ఆలయ ట్రస్టు సభ్యులు రామ్‌ప్రసాద్, ఆనంద్, సప్తగిరి కళాశాల ప్రిన్సిపల్ నారాయణరెడ్డి, గంగిరెడ్డి, కూటమి నాయకులు ఉన్నారు.



లేపాక్షి ఆలయంలో ఎమ్మెల్యే సింధూర, పల్లె

అండర్-19 మహిళా క్రికెట్ పోటీలకు తేజశ్విని

ప్రజాశక్తి-కదిరి టౌన్



ఈ నెల 24వ తేదీ నెల్లూరు జిల్లాలో జరిగే దక్షిణ మండల అంతర జిల్లాల క్రికెట్ పోటీలకు ఉమ్మడి అనంతపురం జిల్లా జట్టు తరఫున కదిరి పట్టణానికి చెందిన తేజశ్విని ఎంపికైనట్లు కోచ్ నజీర్ తెలిపారు. తేజశ్విని కుడిచేతి పేసర్‌గా అండర్-19 జట్టుకు మొదటి సారి ఎంపికైంది. దక్షిణ ప్రాంత జిల్లాల క్రికెట్ పోటీలకు కదిరి నుంచి తేజశ్విని ఎంపిక కావడం పట్ల ఎమ్మెల్యే, కదిరి మండల క్రికెట్ సంఘం అధ్యక్షులు కందికుంట వెంకటప్రసాద్ హర్షం వ్యక్తం చేశారు. తేజశ్విని ఈ పోటీల్లో రాణించి విజయవంతంగా తిరిగి రావాలని ఆకాంక్షించారు. క్రీడాకారులకు పవన్‌కుమార్‌రెడ్డి, హరిప్రసాద్‌రెడ్డి, సభ్యులు, సీనియర్ క్రీడాకారులు శుభాకాంక్షలు తెలిపారు.

క్షయ వ్యాధిపై అవగాహన

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

మండలంలోని పెడపల్లి గ్రామంలో శనివారం డిటిసి సూపర్వైజర్ ఆబిద్‌బాషా ఆధ్వర్యంలో క్షయ వ్యాధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ క్షయ వ్యాధిని ఏమాత్రం నిర్లక్ష్యం చేయరాదన్నారు. ఎవరికైనా రెండు వారాలకు మించి దగ్గు రావడంతో పాటు గళ్ల పడడం, ఛాతిలో నొప్పి, ఉదయం, సాయంత్రం జ్వరం, బరువు తగ్గడం, ఆకలి మందగించడం, తదితర లక్షణాలు ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. క్షయ వ్యాధిగ్రస్తులకు ఉచిత వైద్య సదు పాయంతో పాటు పౌష్టికాహారం కోసం ప్రభుత్వం నెలకు రూ. 6వేలు ఇస్తుందన్నారు. క్షయ వ్యాధిగ్రస్తులతో పాటు వారితో సన్నిహితంగా ఉన్న వారికి సివైటిబి పరీక్షలు నిర్వహించాలన్నారు. ప్రతిఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించి ఆరోగ్యవంతమైన జీవనం సాగించాలని కోరారు. కార్యక్రమములో ఎఎన్ఎం సుస్మిత, 104 సిబ్బంది మోహన్, ఆశా కార్యకర్తలు పద్మావతి, వాణిబాయ్, తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టు పిల్లలకు పాఠశాలల్లో 50శాతం ఫీజు రాయితీ

ప్రజాశక్తి-కొత్తచెరువు



డిఇఒ జి.కృష్ణప్ప

జిల్లాలో పని చేస్తున్న వర్కింగ్ జర్నలిస్టుల పిల్లలకు ప్రయివేటు, కార్పొరేట్ పాఠశాలల్లో 50 శాతం ఫీజు రాయితీ కల్పించాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేసినట్లు డిఇఒ జి.కృష్ణప్ప శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ నాయకులు ఇటీవల కలెక్టర్‌ను కలిసి వర్కింగ్ జర్నలిస్టుల పిల్లలకు ప్రయివేట్, కార్పొరేట్ పాఠశాలల్లో 50శాతం ఫీజు రాయితీ కల్పించాలని కోరుతూ వినతిపత్రం సమర్పించారు. దీంతో స్పందించిన కలెక్టర్ టిఎస్.చేతన్ జిల్లా పరిధిలో పని చేస్తున్న వర్కింగ్ జర్నలిస్టుల పిల్లలకు జిల్లా పరిధిలో ప్రయివేట్, కార్పొరేట్ పాఠశాలల్లో 50శాతం ఫీజు రాయితీ కల్పించాలని ఆదేశాలు జారీ చేశారని డిఇఒ తెలిపారు. జిల్లా పరిధిలోని డిప్యూటీ డిఇఒలు, ఎంఇఒలు ఈ ఆదేశాలను అమలు చేయాలని డిఇఒ సూచించారు. వర్కింగ్ జర్నలిస్టుల పిల్లలకు 50 శాతం రాయితీ కల్పించడం పట్ల జర్నలిస్టులు కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

ఎపిడబ్ల్యుజెఎఫ్ హర్షం

పుట్టపర్తి క్రైమ్ : జర్నలిస్టుల పిల్లలకు ప్రయివేటు, కార్పొరేట్ పాఠశాలల్లో 50 శాతం ఫీజు రాయితీపై డిఇఒ జి.కృష్ణప్ప సంబంధిత అధికారు లకు ఆదేశాలు జారీ చేయడం పట్ల ఎపిడబ్ల్యుజెఎఫ్ నాయకులు పూల శ్రీనివాసులు, నాగార్జున, బసప్ప, శివరామకృష్ణ హర్షం వ్యక్తం చేశారు.

పాఠశాలకు వాటర్ ప్లాంట్

ప్రజాశక్తి-గుడిబండ

స్థానిక జడ్పీ హైస్కూల్‌కు ప్రధాన మంత్రి ప్రీ స్కూల్ పథకం ద్వారా రూ. 4.50 లక్షల విలువ చేసే వాటర్ ప్లాంట్‌ను మంజూరు చేయడం పట్ల స్థానిక టిడిపి నాయకులు, వీరశైవ లింగాయత్ జిల్లా అధ్యక్షులు దుర్గేష్, శివకుమార్, ఎంపీటీసీ వనజ శశిధర్ హర్షం వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ ఈ పాఠశాలలో దాదాపు 400 మంది విద్యార్థులు ఉన్నారని, సరైన తాగునీటి సౌకర్యం లేక ఇబ్బందులు పడేవారన్నారు. కూటమి ప్రభుత్వం వాటర్ ప్లాంట్‌ను అందజేయడమే కాకుండా ఇద్దరు వాలంటీర్లను నియమించి వారికి వేతనాలు మంజూరు చేయడం హర్షణీయ మన్నారు. వారు ప్రధాని మోడీ, సిఎం చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు.



పాఠశాలకు చేరిన వాటర్ ప్లాంట్



వైద్య విద్యార్థికి ఆర్థిక సాయం అందజేస్తున్న ట్రస్ట్ సభ్యులు

వైద్య విద్యార్థికి ఆర్థికసాయం

ప్రజాశక్తి-కదిరి టౌన్

నల్లచెరువు మండలంలోని బాలేపల్లి తండాకు చెందిన మూడే అభిలాషనాయక్ తిరుపతిలోని శ్రీబాలాజీ మెడికల్ కాలేజీలో ఎంబిబిఎస్ తృతీయ సంవత్సరం చదువుతున్నాడు. అతడికి శనివారం హార్ట్ టు హెల్ప్ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రూ. 10వేలు అందజేశారు. విద్యుత్ శాఖలో పనిచేస్తున్న జి.స్వప్న సహకారంతో అభిలాషనాయక్‌కు రూ. 10వేలు అందజేసినట్లు ట్రస్ట్ అధ్యక్షులు మూడే రవినాయక్ తెలిపారు. రవి నాయక్ మాట్లాడుతూ విద్యార్థికి మూడేళ్లుగా ట్రస్టు ద్వారా ఆర్థిక సాయం అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో మేనేజింగ్ ట్రస్టీ మూడే లక్ష్మీదేవి, హెచ్ఎం బాబా, ఉపాధ్యాయులు మౌలా, బాలాజీనాయక్, భాస్కర్‌నాయక్ పాల్గొన్నారు.


నేడు శిల్పారామంలో సాంస్కృతిక కార్యక్రమాలు

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

వారాంతపు సెలవు పురస్కరించుకొని ఆదివారం స్థానిక శిల్పారామంలో ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పాలనాధికారి ఖాదర్‌వలి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆదివారం సాయంత్రం 5 నుంచి రాత్రి 8 గంటల వరకు రేణుక ప్రభాకర్ మంజీర డ్యాన్స్, కూచిపూడి అకాడమీ బృందం చేత నృత్య ప్రదర్శనలు ఏర్పాటు చేశామన్నారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల ప్రజల సౌకర్యార్థం ఈ కార్యక్రమం నిర్వహిస్తామని, పట్టణ వాసులే కాక పరిసర గ్రామాల ప్రజలు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

'ఉపాధి' కల్పించి వలసలను అరికట్టాలి

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్



మాట్లాడుతున్న సిఐటియు, ఎపి రైతు సంఘం నాయకులు

గ్రామాల్లో ఉపాధి హామీ పనులు కల్పించి వలసలను అరికట్టాలని సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు. మండలంలోని గొల్లపల్లి గ్రామంలో శనివారం సిఐటియు ఆధ్వర్యంలో శ్రామిక సర్వే నిర్వహించారు. సిఐటియు మండల కన్వీనర్ జెవి.రమణ, ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జంగాలపల్లి పెద్దన్న మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లోని కార్మికులు, కర్షకులు, పేద, మధ్య తరగతి ప్రజలు, రైతులు, వ్యవసాయ కూలీలు ఉపాధి పనులు లేక ఇతర ప్రాంతాలకు వలస వెళ్తున్నారన్నారు. కావున ఉపాధి పనులు కల్పించి వలసలను అరికట్టాలని కోరారు. అలాగే ప్రతి గ్రామంలో పాల డెయిరీ ఏర్పాటు చేయాలన్నారు. పాడి రైతులకు ఎలాంటి ష్యూరిటీ లేకుండా రూ. 10 లక్షల వరకూ రుణాలు ఇవ్వాలని, ఉపాధి హామీ పనులను 200 రోజులకు పెంచాలని, కనీస వేతనం రూ. 600 ఇవ్వాలని, నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పించాలని, నిరుద్యోగ భృతి విడుదల చేయాలని, సిఎం రిలీఫ్ ఫండ్ బిల్లులు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎపి రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఎం. మారుతి, సిఐటియు మండల కో కన్వీనర్ ఎల్. ఆదినారాయణ, ఎపి చేనేత కార్మిక సంఘం నాయకులు వి.వెంకటస్వామి, నాయకులు లింగమయ్య, ఆదినారాయణ, తదితరులు పాల్గొన్నారు.

మహిళలను చితకబాదడమే ఫ్రెండ్లీ పోలీసా.?

సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు జిఎల్.నరసింహులు

ప్రజాశక్తి-కదిరి అర్బన్

మహిళలను చిదకబాది, చిత్రహింసలు పెట్టడమే ఫ్రెండ్లీ పోలీసింగా అని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు జిఎల్.నరసింహులు ప్రశ్నించారు. నంబులపూల కుంటకు చెందిన పార్వతమ్మ, లక్ష్మమ్మ, ప్రశాంత్‌లను ఎస్ఐ వలిబాషా స్టేషన్‌కు పిలిపించి తీవ్రస్థాయిలో చిత్రహింసలు పెట్టడం దుర్మార్గమ న్నారు. గ్రామాల్లో చిన్న చిన్న గొడవలు చోటు చేసుకుంటే చట్టపరంగా చర్యలు తీసుకోవాలే కానీ మహిళలని చూడకుండా చిత్రహింసలు పెట్టడం ఏంటని మండిపడ్డారు. శాంతి భద్రతలను కాపాడా ల్సిన పోలీసులే ఇలాంటి సంఘటనలకు పాల్పడితే ప్రజల పరిస్థితి ఏంటన్నారు. ఎస్ఐ వలిబాషా ఇప్పటికే చాలా చోట్ల ఇలా వ్యవహరించినట్లు తెలిపారు. ఇలాంటి పోలీసు అధికారులతో ఆ వ్యవస్థకే చెడ్డపేరు వస్తుందన్నారు. పోలీసులు స్వార్థం కోసం చట్టాలను దుర్వినియోగం చేస్తే సిపిఎం ఆధ్వర్యంలో గుణపాఠం చెప్పి బాధితులకు అండగా ఉంటామన్నారు. పూలకుంటలో జరిగిన సంఘటనపై జిల్లా అధికారులు సమగ్ర విచారణ చేసి ఎస్ఐ వలిబాషాను సస్పెండ్ చేసి బాధితులకు న్యాయం చేయాలని కోరారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

నాటుసారా తయారీదారులపై కఠిన చర్యలు

ప్రజాశక్తి-కదిరి టౌన్



మాట్లాడుతున్న ప్రొహిబిషన్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగముద్దయ్య,


నాటుసారా తయారీదారులపై ఉక్కుపాదం మోపి కఠిన చర్యలు తీసుకుంటామని ప్రొహిబిషన్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగముద్దయ్య, జిల్లా ప్రొహిబిషన్ ఎక్సైజ్ అధికారి గోవింద నాయక్ హెచ్చరించారు. వారు శనివారం కదిరి ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా సిఐ రామ్మోహన్ ను అడిగి నాటుసారా తయారీదారులపై నమోదైన కేసుల వివరాలు తెలుసుకున్నారు. కదిరి స్టేషన్ పరిధిలో నాటుసారా తయారీ, విక్రయాలు, అక్రమ రవాణా, తదితర అసాంఘిక కార్యకలాపాలను కట్టడి చేయాలన్నారు. అందుకు పోలీస్, ఎక్సైజ్, రెవెన్యూ, పంచాయతీరాజ్, అటవీ శాఖల సాయంతో మార్గదర్శకాలు రూపొందించి తయారీదారులపై ఉక్కు పాదం మోపాలని సిబ్బందికి సూచించారు. నాటుసారా తయారీకి పదే పదే సహకరిస్తున్న వ్యక్తులపై పీడీ యాక్ట్ కేసు నమోదు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. సెప్టెంబర్ 30వ తేదీ లోపు కదిరి ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని గ్రామాలను నాటుసారా రహిత గ్రామాలుగా తీర్చిదిద్దాలని ఆదేశించారు. మద్యం దుకాణదారులు ఎక్సైజ్ నియమ, నిబంధనలు, సమయపాలన పాటించాల న్నారు. ఉదయం 10 నుంచి రాత్రి 10 గంటల వరకు మాత్రమే విక్రయాలు జరిపేలా పర్యవేక్షించాలని సూచించారు. వారి వెంట సిఐ రామ్మోహన్, సిబ్బంది ఉన్నారు.

ఉపాధ్యాయుడు కనిపించలేదని ఫిర్యాదు

కదిరి టౌన్ : ప్రభుత్వ ఉపాధ్యాయుడు కనిపించకుండా పోవడంతో మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు పట్టణ సిఐ నారాయణరెడ్డి తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాలు.. పట్టణంలోని మారుతినగర్‌లో నివాసం ఉంటున్న షేక్ ఆసిఫ్ మహమ్మద్ నిజాంవలి కాలనీలోని మున్సిపల్ ప్రైమరీ స్కూల్‌లో ఉపాధ్యాయుడిగా పని చేస్తుండేవాడు. ఈయన సుమారు రూ. 50 లక్షల వరకూ అప్పులు చేసి అవి చెల్లించలేక తీవ్ర ఇబ్బందులు పడేవాడు. ఈ క్రమంలో అతడి భార్య పటాన్ జిగిని అప్పులు ఎందుకు చేశావని ప్రశ్నించడంతో పాఠశాలకు వెళ్తున్నానని చెప్పి వెళ్లిన వ్యక్తి తిరిగి ఇంటికి రాలేదు. దీంతో అతని భార్య జిగిని ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు సిఐ తెలిపారు. ఎవరికైనా అతడి ఆచూకీ తెలిస్తే కదిరి టౌన్ పోలీస్ స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని కోరారు.

బదిలీ ఉపాధ్యాయులకు సన్మానం

సోమందేపల్లి : మండల పరిధిలోని ప్రాథమికోన్నత పాఠశాలల్లో పని చేస్తూ బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు హనుమంతరాయుడు, గణేష్‌లను శనివారం పాఠశాల సిబ్బంది, గ్రామస్తులు సన్మానించారు. అలాగే ప్రాథమికోన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న ఎన్.హేమావతి ఎంఎంఎస్ పరీక్షలో ప్రతిభ చాటడంతో ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో సర్పంచి గిరిజమ్మ నాగరాజురావు, టిడిపి నాయకుడు కడపల్లి రంగప్ప, నారాయణ, ఉపాధ్యాయులు దస్తగిరి, కృష్ణానాయక్, రమేష్, విద్యార్థులు పాల్గొన్నారు.



బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులను సన్మానిస్తున్న సర్పంచి



జిల్లా టాపర్ బిందును సన్మానిస్తున్న ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు

ఇంటర్‌లో జిల్లా టాపర్‌కు విట్‌లో సీటు

ప్రజాశక్తి-చిలమత్తూరు

స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుతున్న తుమ్మలకుంట గ్రామానికి చెందిన పి.బిందు ఇంటర్మీడియట్‌లో 980 మార్కులు సాధించి జిల్లా టాపర్‌గా నిలిచింది. దీంతో ఆమెకు 'వేలూరు ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, ఆంధ్రప్రదేశ్' విశ్వవిద్యాలయంలో ఉచిత ఇంజినీరింగ్ సీటు, వసతి లభించింది. దీంతో విద్యార్థిని పి.బిందును కళాశాల ప్రిన్సిపల్, అధ్యాపకులు బిందును సత్కరించారు. బిందు మాట్లాడుతూ తన విజయంలో తల్లిదండ్రులు భాస్కర్‌రెడ్డి, శాంత, అధ్యాపకుల ప్రోత్సాహం కీలకమన్నారు. ఆమె సాధన ఇతర విద్యార్థులకు ప్రేరణగా నిలుస్తుందని ఉపాధ్యాయులు అభినందించారు.

ముందుకు 'సాగు'య్యేనా..!

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఖరీఫ్ సీజన్ మొదలైంది. ఒకవైపు వర్షాలు సానుకూలంగా పడుతున్నాయి. ప్రధాన జలాశయాలకు నీరు వచ్చి చేరుతోంది. అయితే ఆ నీటిని సకాలంలో తీసుకునే అవకాశముందా లేదా అన్నది మాత్రం సందేహంగానే ఉంది. అనంతపురం జిల్లాకు ప్రధాన జలవనరుగానున్నది తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ. ఈ డ్యామ్‌లో గతేడాది 19వ గేటు కొట్టుకుపోయింది. దాని ఏర్పాటు ఈ ఏడాది ప్రారంభమైనా పూర్తవలేదు. ఇప్పుడు తుంగభద్ర డ్యామ్‌కు ఇన్‌ఫ్లోస్ పెరుగుతున్నాయి. ఇప్పటికే డ్యామ్‌లో 40 టిఎంసిల వరకు నీళ్ళు చేరాయి. ఇక్కడి నుంచి కాలువలకు నీటిని తీసుకునేందుకు వీలుంటుంది. కాని నీరు కాలువల ద్వారా తీసుకోవాలంటే తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువలో జరుగుతున్న మరమ్మతు పనులు మధ్యలోనే ఆగాయి. ఇవి పూర్తవకుండా నీటిని తీసుకునేందుకు అవకాశం లేదు. ఇంకో వైపు డ్యామ్ భద్రత రిత్యా ఈసారి పూర్తి స్థాయిలో నీటి నిలువను డ్యామ్‌లో ఉంచేందుకు వీల్లేకుండా ఉంది. 80 టిఎంసిల వరకే నీళ్లు తీసుకునేందుకు అవకాశముంది. పూర్తి సామర్థ్యం వంద టిఎంసియితే.. మొత్తం నిలువ ఉంచితే డ్యామ్ భద్రతకు ముప్పు ఉందని నిపుణులు చెబుతున్నారు. నిలువ తగ్గడం వల్ల తక్కువ సమయంలో ఎక్కువ నీళ్లు ముందు నుంచి తీసుకోవాల్సి ఉంటుంది. కాని తీసుకునేందుకు ఎగువ ప్రధాన కాలువ మరమ్మతులు పూర్తవలేదు. ఆలస్యంగా నీటిని తీసుకోవాల్సి వస్తుంది. దీని వల్ల జిల్లాకు నీటిని తీసుకోవడం తక్కువ అయితే ఆ ప్రభావం సాగు,తాగునీటిపై పడే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఇక హంద్రీనీవా పరిస్థితి అదే రకమయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. హంద్రీనీవా ప్రవాహ సామర్థ్యాన్ని 3850 క్యూసెక్కులకు పెంచుతూ కాలువ వెడల్పు పనులు నడుస్తున్నాయి. జూన్ 30వ తేదీలోపు పూర్తి చేస్తామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అనంతపురం జిల్లా పర్యటనలో అధికారులు తెలిపారు. కాని ఆచరణలో పనులు అంత వేగంగా నడవటం లేదు. వచ్చే నెల వరకు కూడా కొనసాగే అవకాశాలే కనిపిస్తున్నాయి. ఈ పనుల నడుమ నీటి విడుదలలోనూ జాప్యం జరిగే సూచనలే కనిపిస్తుండటం గమనార్హం.

ఈ వారంతా అధికారులు అన్ని కార్యక్రమాలను యోగాంధ్ర చుట్టూ నడిపారు. ప్రతి రోజూ ఏదోకచోట యోగాసనాలు వేసే కార్యక్రమాలు చేపట్టారు. శనివారం నాడు అయితే ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పెద్దఎత్తున కార్యక్రమాలు నిర్వహించారు. చివరికి ఉపాధి హామీ పనికెళ్లే వ్యవసాయ కూలీలతోనూ యోగసనాలు వేయించారు. ఉదయం లేస్తే కడుపు నింపుకోవడం కోసం ఆరుగాలం కష్టపడే వ్యవసాయ కూలీలతో యోగాసానాలను ప్రచారం ఏమిటన్న విమర్శలూ వినిపించాయి.



రాజకీయంగా గుంతకల్లు ఎమ్మెల్యే వ్యాఖ్యలు దుమారమే రేపుతున్నాయి. తమ పార్టీలో చేరాలంటూ చేసిన వ్యాఖ్యలపై ప్రతిపక్ష పార్టీ నేతలు విమర్శలకు దిగారు. ఆయన తీరు సరైంది కాదని మండిపడుతున్నారు. రామగిరి మండలంలో జగన్మోహన్‌రెడ్డి నిర్వహించిన పరామర్శ కార్యక్రమంలో నెలకొన్న హెలీకాప్టర్ కేసు విచరణ ఇంకా కొనసాగుతూనే ఉంది. విచారణకు హాజరుకావాలని రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డికి రామగిరి పోలీసులు మరోమారు నోటీసులిచ్చారు. అయితే ఆయన విచారణకు హాజరవలేదు. ఇప్పటికే పైలెట్, కో పైలెట్‌లను విచారించిన పోలీసులు, మరోమారు తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డిని విచారించేందుకు పిలిచారు. ఈ విచారణ ఎప్పటికి పూర్తయి నివేదికను తయారు చేస్తారో చూడాల్సి ఉంది.